సాక్షి సూర్యాపేట

మంగళవారం । 21 । మార్చి । 2023



నక్సలైట్ల పేరుతో బెదిరింపులు

డబ్బుల కోసం నక్సలైట్ల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. - 8లో



లీకేజీపై విచారణ జరిపించాలి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి జానారెడ్డి డిమాండ్ చేశారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 34°/23°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

25న బల్లకట్టుకు వేలం పాట

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయ పరిధిలో గల చింతలపాలెం మండలంలోని చింత్రియాల, బుగ్గమాధారం రేవుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో బల్లకట్టు నిర్వహణకు ఈ నెల 25న సాయంత్రం 4గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈఓ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారులు ఈ నెల 25వ తేదీలోపు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో రూ.2000 చెల్లించి షెడ్యూల్ ఫారం పొందవచ్చని సూచించారు. ధరావతు సొమ్మును నగదు,లేక డీడీ రూపంలో చెల్లించి పాటలో పాల్గొనచ్చని పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలం జరిగే సమయానికి గంట ముందు ధరావతు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

హామీలు నెరవేర్చాలి



దీక్షలో పాల్గొన్న నాయకులు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): గతంలో యాదగిరిగుట్టలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో గీత కార్మికులకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. మునుగోడు ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నిర్వహించిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ కొన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు, గీతన్న బంధు, గీతన్న బీమా, పది రోజుల్లోఎక్స్‌గ్రేషియా, సొసైటీలకు లిక్కర్ షాపులు ఇస్తామని చెప్పి నేడు మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెల్గూరి గోవిందు, మడ్డి అంజిబాబులు, ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్, గుణగంటి కృష్ణ, జయమ్మ కొండ అన్నపూర్ణ, బాలగోని రేణుక పాల్గొన్నారు.

పంటల పరిశీలన



వెలిశాలలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని వెలిశాల, తాటిపాముల గ్రామాల్లో ఈదురు గాలులు, వడగళ్ల వానకు దెబ్బ తిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈఓలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్ ఉపేందర్, రైతులు శ్రీనివాస్, రాములు, అయిలయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం అఖిలభారత కమిటీ పిలుపు మేరకు ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా చేపట్టే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా కేంద్ర బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతూ పేదలపై భారాలు మోపుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్, జిల్లెపల్లి నర్సింహారావు, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, చినపంగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు అమృత్ సరోవరం

- మిషన్ అమృత్ సరోవర్ పథకంలో కుంటలు, చెరువుల పునరుద్ధరణ
- భూగర్భ జలాల పెంపునకు కేంద్రం ప్రత్యేక కార్యాచరణ
- జూలై నాటికి వంద చెరువులు, కుంటల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యం



పస్తాలలో కుంటలో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

నాగారం: పల్లెల్లో నీటి ఎద్దడి నివారణకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మిషన్ అమృత్ సరోవర్ పథకం అమలులోకి తెచ్చింది. తద్వారా నీటి వనరులను అభివృద్ధి చేస్తోంది. ఈక్రమంలో కుంటలు, చెరువుల మరమ్మతులతో పాటు కొత్త నిర్మాణాలను చేపడుతోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథంలో వీటిని చేర్చడం వల్ల కూలీలకు ఉపాధి లభిస్తోంది. గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు ఇవి ఎంతో దోహదపడుతుండటంతో పాటు బహుళ ప్రజయోనాలు చేకూరనున్నాయి.

పథకం పనులు ఇలా..

సంవత్సరం	మంజూరైన పనులు	పూర్తయినవి
2022	75	24
2023	75	-

గరిష్ఠంగా రూ.10లక్షలు...

భూగర్భ జలాలను పెంచడానికి అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో కుంటల మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. ఎకరం నుంచి రెండు ఎకరాల విస్తీర్ణంగల చిన్న కుంటలను అభివృద్ధి చేయడానికి ప్రతి మండలంలో కనీసం రెండు నుంచి ఐదు కుంటలను ఎంపిక చేసి వాటిలో పూడిక తీసే పనులను చేపట్టనున్నారు. వీటికి గరిష్ఠంగా రూ.10లక్షల నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టే అవకాశముంటుంది. ఎలాంటి యంత్రాలు వినియోగించకుండా ఒక్కో చోట సుమారు వంద మంది కూలీలతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన కుంటల్లో 10వేల ఘనపు అడుగుల మేర మట్టి పూడిక తీయనున్నారు. కరకట్ట బలంగా ఉండేందుకు పూడిక తీతలో వచ్చే మట్టిని పోయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో వరదనీరు కుంటల్లోకి చేరి సత్ఫలితాలిస్తాయి. ఈ ప్రాంతంలో బోరు బావులే ఆధారం. భూగర్భ జలాల వృద్ధికి కుంటలు దోహదపడతాయి. పశువులు, ఇతర వన్యప్రాణులు దాహార్తి తీర్చేకునేందుకు ప్రయోజనకరంగా వీటిని తీర్చిదిద్దనున్నారు.

పనులు త్వరగా పూర్తి చేస్తాం



భూగర్భ జలాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ సరోవర్ పథకాన్ని తీసుకొచ్చింది. రైతులకు, కూలీలకు, పశువులకు అమృత్ సరోవర్ ఎంతో మేలు చేస్తుంది. ఏళ్ల తరబడి పూడిక తీయని చెరువులు, కుంటలను ఈ పథకంలో ఎంపిక చేశాం. వీలైనంత త్వరగా పూర్తి చేసి వర్షాకాలంలో నీటిని ఒడిసిపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట.

పూర్తి చేసేలా కార్యాచరణ..

జిల్లాలోని 23 మండలాల్లో గత ఏడాది 75 చెరువులు, కుంటల మరమ్మతులు, పూడికతీత పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు మిషన్ అమృత్ సరోవర్‌లో గుర్తించారు. ఒక్కో పనికి సుమారు రూ.7లక్షలు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 24 పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది సైతం 75 చెరువులు, కుంటల పనులు చేపట్టాల్సి ఉంది. గత ఏడాది లక్ష్యం పూర్తికాక పోవడంతో ఈ సారి ఏప్రిల్ నుంచి జూలై వరకు వంద పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

● బోనమెత్తిన పల్లె



చివ్వెంల మండలం వట్టి ఖమ్మంపహాడ్ గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ పండుగ సందర్భంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రైతు వేదికల్లో ఎరువులు

- వానాకాలం నుంచి అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక
- ఏఈఓల ఆధ్వర్యంలో విక్రయించడానికి కసరత్తు
- రైతుల వివరాల సేకరణలో అధికారులు



హుజూర్‌నగర్‌లోని రైతు వేదిక

హుజూర్‌నగర్ : లక్షల రూపాయలు వెచ్చించి క్లస్టర్ల వారీగా నిర్మించిన రైతుల వేదికలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతు వేదికల్లో వ్యవసాయ దారులకు సాగులో సస్యరక్షణ చర్యలు, ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు అవసరమైన ఎరువులు కూడా అందుబాటులో ఉంచాలని భావిస్తోంది. వచ్చే వానాకాలం నుంచి ఏఈఓల ఆధ్వర్యంలో ఎరువులు విక్రయించేలా కసరత్తు చేస్తోంది.

రైతు వేదికల్లో వసతి ఉండటంతో..

ప్రస్తుతం పంటలకు అవసరమైన ఎరువుల్లో సగం మేర సహకార సంఘాలు, ఆగ్రోస్, డీసీఎంఎస్, హాకా సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తోంది. మిగిలిన 50శాతం శాతాన్ని ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లో వసతి ఉండటంతో ఎరువుల విక్రయించాలని నిర్ణయం తీసుకుంది. అవసరమైన శిక్షణ, సేవలపై అవగాహన కల్పించేందుకు పెద్ద హాల్, గోదాం వసతి ఉండేలా ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా గుర్తించి రైతు వేదికలను నిర్మించారు. ఇవి అన్ని చోట్లా పూర్తి అయి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్ పరిధిలోని రైతులు, రైతు సమన్వయ సమితి సభ్యులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో శిక్షణ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

23 మండలాల్లో 82 రైతు వేదికలు..

జిల్లాలో 23 మండలాల పరిధిలో 82 క్లస్టర్లు ఉండగా ఒకో క్లస్టర్ పరిధిలో ఒకటి చొప్పున 82 రైతు వేదికలు నిర్మించారు. ఇక రైతులు 2,70,853 మంది ఉన్నారు. వ్యవసాయ అనుకూలమైన భూమి 6.91 లక్షల ఎకరాలు ఉంది. దానిలో 5.82 లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. వానాకాలం 5.87 లక్షల ఎకరాలు, యాసంగిలో 4.80 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. కాగా వ్యవసాయానికి 1,14,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతున్నాయి. వాటిలో యూరియా 58,100 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11,620 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 38,120 మెట్రిక్ టన్నులు, పోటాష్ (ఎంఓపీ) 7,065 మెట్రిక్ టన్నులను రైతులు ఆయా పంటలకు వాడుతున్నారు.

మార్గదర్శకాలు వస్తే ఏర్పాట్లు చేస్తాం



రైతు వేదికల్లో ఎరువుల విక్రయాలపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఇప్పటికైతే పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆగ్రోస్ తదితర సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం. రైతు వేదికల ద్వారా అందించే ఎరువులపై ప్రభుత్వం, ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు వస్తే వాటికి అణుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– డి. రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

ఏఈఓల ఆధ్వర్యంలో విక్రయాలు..

ఇకపై డీసీఎంఎస్‌లు ఎరువులు కొనుగోలు చేసి రైతు వేదికలకు పంపిస్తాయి. ఇక్కడ వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) ఆధ్వర్యంలో నిర్ణీత ధరలకు విక్రయించనున్నారు. వచ్చే వానాకాలం నుంచే రైతువేదికల్లో విక్రయించేందుకు ప్రభుత్వం కరసరత్తు చేస్తోంది. ఇందు కోసం వేదికల వారీగా రైతుల వివరాలు, ఎరువుల అవసరాలపై క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారుల నుంచి నివేదికలను కోరినట్లు తెలిసింది.

విత్తనాలు కూడా విక్రయించే యోచన..

రైతు వేదికల్లో ఎరువుల విక్రయాలు విజయవంతమైతే తర్వాత విత్తనాలు కూడా ఇక్కడే విక్రయించాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా కేంద్రాల్లో ఎరువుల నిల్వ, భద్రత, వేదికల వద్దకు రవాణా తదితర అంశాలపై డీసీఎంఎస్ ఏర్పాట్లు చేస్తోంది. ఇవన్నీ పూర్తిఅయి ఎరువుల విక్రయాలు ఇక్కడే జరిగితే రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఇంటి వద్దకే 'భద్రాద్రి' తలంబ్రాలు

ఆర్టీసీ కార్గో ద్వారా సరఫరా

- రూ.116 చెల్లించి వివరాలు నమోదు చేయిస్తే చాలు
- భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవం ముగిశాక అందజేత
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆర్టీసీ, దేవాదాయశాఖ



స్వామిఅమ్మవార్ల తలంబ్రాల కోసం బుక్ చేసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

భానుపురి (సూర్యాపేట) : శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో సీతారాముల కల్యాణోత్సవం చూసేందుకు భక్తులు ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఏమైనా ఇబ్బందులతో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని చూసి తరించే భాగ్యం దక్కని భక్తుల కోసం ఆర్టీసీ, దేవాలయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగించే తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే చేరవేసే కార్యక్రమాన్ని చేపట్టింది. తద్వారా ఓ వైపు భక్తులకు సేవ చేస్తూనే.. మరోవైపు ఆర్టీసీ తన ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది.

రూ.116 చెల్లిస్తే..!

శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి వెళ్లలేని వారు నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లోని కార్గో కార్యాలయాల్లో రూ.116 చెల్లిస్తే అక్కడ వాడిన తలంబ్రాలను ఇంటికే పంపనున్నారు. లేదంటే రీజినల్ మార్కెటింగ్ ఆఫీసర్ 9154298690, డిపో మార్కెటింగ్ ఆఫీసర్ నల్లగొండ 9154298691, నార్కట్‌పల్లి 9154298692, మిర్యాలగూడ 9154298693, దేవరకొండ 9154298694, సూర్యాపేట 9154298695, కోదాడ 9154298696, యాదగిరిగుట్ట 9154298697లను సంప్రదించి వివరాలు నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్ (ఫోన్‌పే), (గూగుల్‌పే)లో డబ్బులు చెల్లిస్తే రశీదు పంపుతారు. తలంబ్రాల బియ్యం ఇంటికి చేరవేస్తారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తుల వద్దకు చేర్చేలా ఆర్టీసీ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం కేవలం రూ.116 చెల్లిస్తే సరిపోతుంది. శ్రీరామనవమి సందర్భంగా స్వామిఅమ్మవార్ల కల్యాణం ముగిశాక ఇంటికే పంపిస్తాం. ఇందుకోసం గ్రామాల్లోనూ ప్రచారం చేసి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాలి. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– సుందర్, డిపో మేనేజర్, సూర్యాపేట

తిరుమలగిరి మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం అమావాస్య, బుధవారం ఉగాది పండుగ సందర్భంగా రెండు రోజులు సెలవులు ఇస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన మార్కెట్ పునః ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

24న మినీ జాబ్ మేళా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 24న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సామ మాధవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ సిటీ డెవలపర్స్ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 400 ఖాళీలు, వీవింగ్స్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్‌లో వేర్‌హౌస్ అసోసియేట్స్ 25 ఖాళీలు, సుషిర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్స్ 40 ఖాళీలు ఉన్నాయని ఈ సందర్భంగా వివరించారు. 10 వ తరగతి ఆపై విద్యార్హత కలిగి 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెలకు రూ. 15 వేలకు పైగా వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఆసక్తి గల వారు ఈ నెల 24న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు అర్బన్ సిటీ డెవలపర్స్ మేనేజర్ సెల్ : 9573381973, వీవింగ్స్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ మేనేజర్ సెల్ : 9848275443. సుషిర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ మేనేజర్ సెల్ : 9390393669 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆహారంలో కల్తీ జరిగితే చర్యలు

సూర్యాపేట: ఆహారంలో కల్తీ జరిగితే చర్యలు తప్పవని జిల్లా ఆహార తనిఖీ, పర్యవేక్షణ అధికారి కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో వైన్ షాపుల ముందు ఆహార విక్రయదారులకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఆకస్మిక తనిఖీ నిర్వహించి తినుబండారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంగుల విషయంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. గాఢమైన రంగులు, మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలకు లోబడి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని ఆదేశించారు. తినుబండారాలపై ఈగలు వాలకుండా మూతలు కప్పి ఉంచాలని సూచించారు. ఆహార విషయంలో కల్తీ జరిగితే 9885407703కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారుడినుంచి వచ్చిన వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రజావాణిలో మొత్తం 33 దరఖాస్తులు రాగా ఆర్డీఓకు 4 , టీఎస్ ట్రాన్స్‌కో 1, డీడబ్ల్యూఓ 4, డీఈఓ 1 , డీటీడీఓకు 1, డీఆర్‌ఓ సూర్యాపేటకు1 , డీఆర్‌డీఓ 4, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు సంబంధించి 5 దరఖాస్తుల అందినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ సురేష్, డీఆర్ఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు నిర్వహించడం అభినందనీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక



ఉగాది పురస్కారం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సూర్యాపేట టౌన్: శోభాయమానంగా శోభకృత్ నామ సంవత్సర అక్షర ఉగాది వేడుకలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపికా యుగంధర్ అన్నారు. సోమవారం సూర్యాపేటలో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షర ఉగాది వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న అక్షర ఫౌండేషన్ అన్ని రంగాల్లో రాణిస్తున్న 60 మందికి ఉగాది పురస్కారాలు అందజేయడం సంతోషకరమన్నారు. అక్షర ఫౌండేషన్‌కు తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఎన్‌డీసీ ఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ అక్షర ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించి 60 మందికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, అక్షర ఫౌండేషన్ ఫౌండర్, చెర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, ఉప్పు నాగయ్య, పాల్వాయి వెంకన్న, తిరుమల రెడ్డి, పాపయ్య తుంగతుర్తి జనార్దనాచారి, చంద్ర ప్రసాద్, మడూరి హనుమాచారి, కౌన్సిలర్ సుంకరి రమేష్, శేషరాజుల రవి, కందాల వెంకట్ రెడ్డి, రుద్రంగి కాళిదాసు, వీరాసింగ్, తిరుమల్ రెడ్డి, సైదయ్య, ఉపేందర్ ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల ఖాళీలు 182

- ఐదేళ్లు కావొస్తున్నా నియమించని ప్రభుత్వం
- కొత్త పంచాయతీల్లో 152.. వివిధ కారణాలతో మరో 30 ఎఫ్‌ఏ పోస్టులు ఖాళీ
- ఉపాధి హామీ పథకం పనులపై కొరవడిన పర్యవేక్షణ



ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

చిలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో 2,689 ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇక్కడ 5,421 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఏటా సుమారు 35 వేల పని దినాలు కల్పిస్తున్నారు. దాదాపు కోటి రూపాయల వరకు పనులు జరుతున్నాయి. అయితే ఇక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ వివిధ కారణాలతో సస్పెండ్ అయ్యారు. పనులను గ్రామ కార్యదర్శి పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటి పరిస్థితి కొత్త గ్రామ పంచాయతీలతో పాటు ఎఫ్‌ఏలు లేని పాత పంచాయతీల్లో నెలకొంది.

చిలుకూరు: కొత్త గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వహణకు నేటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదు. ప్రస్తుతం పాత గ్రామ పంచాయతీల వారే ఆ పనులను పర్యవేక్షిస్తున్నారు. కొన్ని చోట్ల ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు గ్రామాలను చూడాల్సి వస్తోంది. దీంతో పర్యవేక్షణ గాడి తప్పి పనుల్లో పారదర్శకత లోపిస్తోంది.

గ్రామ పంచాయతీకి ఒకరు చొప్పున

జిల్లాలోని 475 పంచాయతీల్లో పాత గ్రామ పంచాయతీలు 323, కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు 152 ఉన్నాయి. నేటి వరకు కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించలేదు. అంతేకాక గ్రామాల్లోని వివిధ కారణాలు అంటే సెస్పెండ్ అయిన వారు, మృతి చెందిన వారు, స్వయంగా విధులకు రాని వారు లాంటి తదితర కారణాలతో మరో 30 మంది వరకు ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 182 వరకు ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి ప్రతి గ్రామానికి ఒక ఎఫ్‌ఏను నియమించాలి. కొత్త పంచాయతీల్లో ఎఫ్‌ఏను నియమిస్తారని ఆశిస్తుండగా అయిదేళ్లుగా కావొస్తున్నా నేటి వరకు నియామకాలు చేపట్టలేదు. దీంతో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల పర్యవేక్షణ ఇబ్బందికరంగా మారింది.

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



కొత్త గ్రామ పంచాయతీల్లో ఎఫ్‌ఏల నియామకం మా పరిధిలోని కాదు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. ప్రస్తుతం కొత్త పంచాయతీల్లో సీనియర్ మేట్‌ల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోంది. ఇప్పటి వరకైతే పర్యవేక్షణపై ఎలాంటి ఫిర్యాదులు లేవు. ప్రభుత్వం ప్రతి గ్రామానికో ఎఫ్‌ఏను నియమించాలని ఆదేశిస్తే నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం.

– డాక్టర్ పెంటయ్య, జిల్లా ఏపీడీ

క్లుప్తంగా

అటవీ సిబ్బందిపై దాడి

- ఒకరి తలకు గాయం
- నిందితులపై కేసు నమోదు

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్‌దర్గా పరిధిలోని పసుపుబోడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఆదివారం రాత్రి అటవీ ఆక్రమణదారులు ఫారెస్ట్ బీట్ బేస్ క్యాంపు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పసుపుబోడు రిజర్వ్ ఫారెస్ట్‌లో కొందరు అటవీ ఆక్రమణలకు పాల్పడుతున్నారనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి ఫారెస్ట్ బేస్ క్యాంపు సిబ్బంది షేక్ రియాజ్, భూక్యా సైదులు అక్కడకు చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆక్రమణదారులు ఫారెస్ట్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రియాజ్ తలకు గాయమైంది. దీంతో వారు ఫారెస్ట్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న హుజూర్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి గౌతమ్ సోమవారం ఘటనకు గల కారణాలను తమ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడింది మండలంలోని రావిపహాడ్ గ్రామానికి చెందిన కల్లేటి సైదులు, కల్లేటి అంజి జాన్‌పహాడ్‌దర్గాకు చెందిన లకావత్ నరసింహ, మఠంపల్లి మండలం బొజ్యగూడెం గ్రామానికి చెందిన గుగులోతు శ్రీనుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

నక్సలైట్ల పేరుతో బెదిరింపులు

- పోలీసులను ఆశ్రయించిన వ్యాపారి
- వలపన్ని పట్టుకున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: గతంలో జనశక్తిలో కొరియర్‌గా పనిచేసి పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశాక ఈజీగా డబ్బులు సంపాదించాలనే తలంపుతో నక్సలైట్ పేరును ఉపయోగించుకుని పలు నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ పి.వెంకటగిరి వెల్లడించిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనా రావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అలియాస్ ప్రమోద్ 1996 నుంచి 1998 వరకు జనశక్తి గ్రూపులో పని చేసి అప్పట్లోనే పోలీసులకు లొంగిపోయాడు. దీంతో పోలీసులకు ఇన్ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని జనశక్తి సభ్యులు గతంలో రెండుసార్లు సుదర్శన్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. ఈ క్రమంలో తనకు ప్రాణహాని ఉందనే నెపంతో 2002లో లైసెన్స్‌డ్ తుపాకీ పొందాడు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటున్నాడు. ప్రైమ్ కన్‌స్ట్రక్షన్ పేరుతో హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్లు నిర్మించి అమ్ముతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంతో ఆ వ్యాపారంలో భారీగా నష్టం వచ్చింది. వ్యాపార లావాదేవీల్లో



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

అధిక వడ్డీకి అప్పులు తేవడంతో వారి వేధింపులు ఎక్కువ కావడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనకు వచ్చాడు. మొగుళ్లపల్లి కృష్ణమూర్తి అనే వ్యక్తితో కలిసి పెద్దపల్లి, సుల్తానాబాద్, హనుమకొండ, కరీంనగర్‌లలో బడా రైస్‌మిల్ వ్యాపారుల వివరాలు తెలుసుకుని మావోయిస్టు పార్టీకి ఫండ్స్ ఇవ్వాలని తుపాకీతో బెదిరించి డబ్బులు తీసుకోవడంతో పలు కేసులు నమోదై జైలుకు కూడా వెళ్లొచ్చాడు. అయినా తన తీరులో మార్పు తెచ్చుకోకపోగా దొంగతనాలకు పాల్పడి కూడా తిరిగి జైలుకు వెళ్లొచ్చాడు. అనంతరం మేడ్చల్ జిల్లా కాప్రా మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన సుంచు మల్లేష్ పరిచయం అయ్యాడు. సుదర్శన్‌రెడ్డి బెదిరింపుల ద్వారా వసూలు చేసిన డబ్బులను సుంచు మల్లేష్‌కు ఫోన్ పే చేయించడం ఇద్దరు వాటాలు పంచుకోవడం జరుగుతుంది. ఈ దశలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ కు ఫోన్‌చేసి.. తాము నక్సలైట్లమని, తక్షణమే రూ.5లక్షలు ఇవ్వకుంటే కుటుంబ సభ్యులను చంపుతామని సుంచు మల్లేష్, సుదర్శన్‌రెడ్డి బెదిరించారు. దీంతో వారి బెదిరింపులకు భయపడిన శ్రీనివాస్ ఈ నెల 18న సుంచు మల్లేష్ కు రూ.10వేల రూపాయలను ఫోన్ పే చేశారు. మిగిలిన డబ్బులను అంత డబ్బును ఫోన్ పే చేయడం కుదరదని మీరే వచ్చి తీసుకోవాలని వారితో వ్యాపారి చెప్పాడు. ఈ విషయం వెంటనే శ్రీనివాస్‌కు పోలీసులకు చెప్పాడు. మల్లేష్, సుదర్శన్‌రెడ్డిలు డబ్బుల కోసం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు రావడంతో ముందే అక్కడ మాటు వేసిన పోలీసులు వలపన్ని వారిని పట్టుకున్నారు. విచారణలో తాము చేసిన నేరాలను అంగీకరించడంతో ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఒక స్మార్ట్ ఫోన్, ఒక కీ ప్యాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ రాఘవేందర్, టూటౌన్ ఎస్‌ఐలు ఏ.సైదిరెడ్డి, ఎస్.కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ కె.లక్ష్మయ్య, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

- చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం వద్ద న్యాయవాది..
- పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మరొకరు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయవాది అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన సముద్రాల పృథ్వీ చక్రవర్తి(53) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. స్నేహితుడి తండ్రి దశదినకర్మ కోసం ఆదివారం ఉదయం సూర్యాపేట జిల్లా పరిధిలోని తుంగతుర్తికి వెళ్లాడు. అక్కడి నుండి రాత్రి తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో దండుమల్కాపురం గ్రామ శివారులోని ఇండస్ట్రియల్ పార్కు పైలాన్ దాటాక మూత్రవిసర్జన కోసం కారును రోడ్డు పక్కన ఆపాడు. మూత్రవిసర్జన చేసి తిరిగి కారు ఎక్కుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కృష్ణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.



రాంరెడ్డి (ఫైల్)

మినీ బస్సు ఢీకొని..

పెద్దఅడిశర్లపల్లి: మినీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై అంగడిపేట ఎక్స్ రోడ్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం భారత్‌పురం గ్రామానికి చెందిన చాట్లపర్తి రాంరెడ్డి(65) సోమవారం తన ద్విచక్ర వాహనంపై అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వచ్చి కిరాణా సరుకులు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించేందుకు అంగడిపేట ఎక్స్ రోడ్ సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పెద్దవూర నుంచి వస్తున్న మినీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాంరెడ్డికి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 25 గొర్రెలు మృతి

యాదగిరిగుట్ట రూరల్: కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లి మధిర గ్రామమైన మైలార్‌గడ్డతండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌గడ్డ తండాకు చెందిన గొర్రెల కాపరి ధీరావత్ నర్సింహ ఆదివారం రాత్రి తన గొర్రెలను వ్యవసాయ బావి వద్ద ఉన్న పాకలోకి తోలి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా కుక్కలు దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కనిపించాయి. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధ, ఎంపీడీఓ నర్సింహ తండాకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నర్సింహకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, ఉప సర్పంచ్ కాల్నె భాస్కర్, వార్డు సభ్యురాలు ధీరావత్ సరోజ ఉన్నారు. అదేవిధంగా తండాలో నాలుగు రోజుల క్రితం కూడా తమ 18 గొర్రెలను కుక్కలు దాడి చేసి చంపేశాయని గొర్రెల కాపరులు గూగులోత్ కిషన్, ధీరావత్ మహేందర్ తెలిపారు.

తంగడపల్లిలో 18 గొర్రెలు అపహరణ

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గొర్రెలను చోరీ చేశారు. వివరాలు.. తంగడపల్లి గ్రామానికి చెందిన మాంసం విక్రయదారుడు జావేద్ 18 గొర్రెలను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి తీసుకొచ్చి ఆదివారం రాత్రి ఇంటి పక్కనే ఉన్న దొడ్డిలో కట్టేశాడు. సోమవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా గొర్రెలు కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా గొర్రెలు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

రామన్నపేట: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు మృతిచెందిన ఘటన సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణానికి కందుల వేణు మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వేణు సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోనే మరోచోట ఉంటున్న అతడి తండ్రి అంజయ్య వద్ద ఆడుకుంటున్న తన చిన్నకుమారుడు నిహాల్(18 నెలలు)ను బైక్‌పై తీసుకొచ్చి ఇంటి ముందు దింపి పొలం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో నిహాల్ తల్లి ఇంటి పనిలో నిమగ్నమై ఉండగా, అతడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడి మృతిచెందాడు. అరగంట తర్వాత ఇంటికి వచ్చిన వేణు సోదరుడు శ్రీను సంపులో పడి ఉన్న నిహాల్‌ను గమనించి బయటకు తీశాడు. స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బాలుడిని తల్లిదండ్రులను పరామర్శించారు.



నిహాల్ (ఫైల్)

తాళం వేసిన ఇంట్లో చోరీ

- నగదు, బంగారం అపహరణ

రాజాపేట: తాళం వేసి ఉన్న గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారం అపహరించిన సంఘటన మండలంలోని దూదివెంకటాపురం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూదివెంకటాపురం గ్రామానికి చెందిన గొడిశెల ఉపేందర్ తన తల్లిదండ్రులతో కలిసి ఆదివారం పనిమీద పారుగూరికి వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో దాచిన రెండు బంగారు చైన్లు, ఒక ఉంగరం, కొంత నగదు చోరీకి గురైందని గుర్తించిన ఉపేందర్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దొంగలు

చౌటుప్పల్: రోడ్డు వెంట వెళ్తున్న వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం శివారులో అద్దెకు ఉంటున్న భవన్ పాటిల్ పట్టణ శివారులోని శ్రీని పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ ముగిశాక కంపెనీ నుంచి బయటకు వచ్చి హైవే వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతడిపై దాడి చేసి పర్సులో ఉన్న రూ.3100 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

- రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం

సూర్యాపేట క్రైం: విద్యుదాఘాతంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి పట్టణంలోని జమ్మిగడ్డలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మిగడ్డకు చెందిన తోట భారతమ్మ, కుమారుడు విజయ్‌కుమార్ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివాసం ఉంటున్నారు. కాగా రోజు మాదిరిగానే విజయ్‌కుమార్ దుకాణానికి వెళ్లాడు. తల్లి భారతమ్మ ఇంటికి తాళం వేసి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లో నుంచి పొగలు వచ్చాయి. చుట్టుపక్కల వారు వెంటనే విజయ్‌కుమార్, భారతమ్మకు విషయం తెలియజేయగా, వారు వచ్చి చూసేసరికి మూడు కుట్టు మిషన్‌లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఇంట్లో గ్యాస్‌కు మంటలు అంటుకోగా, స్థానికులు పైకప్పు రేకులను పగులగొట్టి నీళ్ల పోయడంతో పెనుప్రమాదం తప్పింది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.4లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

స్కూల్ బస్సు కిందపడి విద్యార్థి మృతి

- వేగంగా వెళ్తున్న బస్సు కుదుపులకు డోర్ నుంచి కిందపడిన విద్యార్థి
- బస్సు వెనక చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి

భూదాన్‌పోచంపల్లి: మమ్మీ బైబై.. అంటూ స్కూల్‌కు వెళ్లిన చిన్నారి కానిరాని లోకాలకు వెళ్లిపోయాడు. స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి చిన్నారి మృతికి కారణమయ్యాడు.



అభిలాష్ (ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన వడ్డేమోని శ్రీనివాస్, రాణి దంపతులకు మల్లికార్జున్, అభిలాష్(8) ఇద్దరు కుమారులతో పాటు కుమార్తె వర్షిత ఉన్నారు. వీరంతా మండల కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో చదువుతున్నారు. మల్లికార్జున్ 5వ తరగతి, అభిలాష్ ఒకట తరగతి, వర్షిత ఎల్‌కేజీ చదువుతుంది. ఉదయం అందరూ రెడీ అయి స్కూల్‌కు వెళ్లారు. ఒంటిపూట బడులు కావడంతో స్కూల్ వదిలిన తరువాత తిరిగి స్కూల్ బస్సు ఎక్కి ఇంటికి బయలుదేరారు.

వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి జారి..

స్కూల్ నుంచి బయలుదేరిన బస్సు.. ఆయా గ్రామాలలో పిల్లలను దింపుతూ చివరగా హైదర్‌పూర్‌కు వెళ్తుంది. బస్సులో 10 మంది వరకు విద్యార్థులున్నారు. ఈ క్రమంలో భీమనపల్లి గ్రామం దాటిన తరువాత బస్సు డ్రైవర్ జింకల రాము అతివేగంగా బస్సును నడిపాడు. గ్రామశివారులోని చెరువు దాటిన తరువాత మూలమలుపు వద్ద కుదుపునకు బస్సులో ఉన్న అభిలాష్ కదులుతున్న బస్సులోంచి జారి కింద పడగా, బస్సు వెనుక చక్రాలు అతనిపై నుంచి వెళ్లింది. విద్యార్థి బస్సులోంచి పడిపోయిన విషయాన్ని డ్రైవర్ కనీసం చూడకుండానే వేగంగా అలానే ముందుకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో భీమనపల్లి గ్రామానికి చెందిన ముంత కృష్ణ అనే వ్యక్తి బైక్‌పై వస్తూ విద్యార్థి కిందపడిపోవడాన్ని గమనించి కొద్దిదూరం వెళ్లిన బస్సును ఆపాడు. అందరూ కలిసి అక్కడికి వెళ్లి చూడగా అభిలాష్ రక్తపుమడుగులో విగతజీవిగా మారాడు.



అభిలాష్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి శ్రీనివాస్, అభిలాష్ అన్న మల్లికార్జున్

బస్సు డోర్‌కు లాక్ ఉండిఉంటే...

స్కూల్ బస్సు డోర్‌కు లాక్ సరిగా లేని కారణంగా బస్సులో ఉన్న వృద్ధురాలైన ఆయా పోశమ్మ డోర్ లాక్ వేయలేదు. మరోవైపు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును వేగంగా నడపడం వల్ల నిండుప్రాణం బలైపోయింది. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న చిన్నారి మృతదేహాన్ని చూసి గుండెవిసేలా రోదించారు. సమాచారం అందుకొన్న ఎస్‌ఐ సైదిరెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ రామును అదుపులోకి తీసుకొన్నారు. అలాగే బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

భువనగిరి : లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన బస్సు నుంచి అభిలాష్(6) అనే విద్యార్థి కిందిపడి మృతిచెందిన విషయంపై ఎంఈవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తదుపరి చర్యల కోసం షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు భువనగిరి డీఈవో కె నారాయణరెడ్డి తెలిపారు.


పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నియామకపత్రం అందజేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్

నల్లగొండ రూరల్: ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేయాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ బోళ్ల వెంకట్ ముదిరాజ్‌ను నియమిస్తూ సోమవారం హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు వెలుగు రవి, ఈదుల యాదగిరి, శ్రీను, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరుకున్న నాటక పోటీలు



విజయనిరుద్ధం పద్య నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు సోమవారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ పోటీలను ఆలయ ప్రధాన పూజారి కారంపూడి రాఘవాచార్యులు, మిర్యాలగూడ సాంస్కృతిక కళావేదిక మాజీ అధ్యక్షుడు గ్యార సాయిలు, మాజీ ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వరంగల్ స్టార్ బ్రదర్ సాంస్కృతిక కళాపరిషత్ వారిచే ప్రదర్శించబడిన విజయనిరుద్ధం అనే పద్య నాటకం చూపరులను ఆకట్టుకుంది. మంగళవారంతో ఈ జాతీయ స్థాయి నాటిక పోటీలు ముగియనున్నాయి.

జీవశాస్త్రం టీచర్ జాతీయ స్థాయికి ఎంపిక

గరిడేపల్లి: విద్యా అమృత్ మహోత్సవంలో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నూతన బోధనా పద్ధతులపై 2022 సెప్టెంబరులో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో గరిడేపల్లి మండలం గడ్డిపల్లి పాఠశాలకు చెందిన జీవ శాస్త్రం ఉపాధ్యాయురాలు మారం పవిత్ర జాతీయ స్థాయిలో రెండవ స్థానానికి ఎంపికయ్యారు. నూతన బోధన పద్ధతులపై ఐదు నిమిషాలు నడివిగల వీడియోను రూపొందించి దీక్షలో పోర్టల్ అప్‌లోడు చేసినట్లు ఆమె తెలిపారు. తాను రూపొందించిన ఈ డిజిటల్ మైక్రోస్కోప్ ధర రూ.1800 మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో ఉపయోగించే సంయుక్త సూక్ష్మదర్శిని రూ.6వేల వరకు ఉంటుందని, దీని ద్వారా ఒక్క విద్యార్థి ఒక్కసారి మాత్రమే సంయుక్త సూక్ష్మదర్శిని పరిశీలించాలంటే స్లయిడ్ తయారు చేసి శాంపిల్‌ను స్లయిడ్‌పై పెట్టి పరిశీలించినప్పుడు ఎక్కువ సమయం పడుతుందని ఆమె వివరించారు. తాను రూపొందించిన మైక్రోస్కోప్ ద్వారా శాంపిల్స్‌ను కంప్యూటర్ ద్వారా ఎక్కువ మంది చూడవచ్చన్నారు. మైక్రోస్కోప్‌ను ఫోన్ ద్వారా, కంప్యూటర్ ద్వారా కనెక్ట్ చేసుకోవచ్చని తెలిపారు. ఉదాహరణకు కణాలు, పత్రకణాలు, పత్ర రంధ్రాలు, కటకదేహం భాగాలు తదితర వాటిని పరిశీలించవచ్చన్నారు.



విద్యార్థులకు సూక్ష్మదర్శిని గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. నిరుద్యోగుల కోసం బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద బీజేపీ భువనగిరి నియోజకవర్గ కన్వీనర్ చిక్క కృష్ణ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ పట్ల నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న మంత్రి కేటీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు చందా మహేందర్ గుప్తా, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, పట్టణ అధ్యక్షుడు ఉమాశంకర్ రావు, నీలం రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్ రత్నపురం బలరాం, నాయకులు భాస్కర్‌రెడ్డి, సీఎన్ రెడ్డి, పంచెద్దుల బలరాం, సుర్వి లావణ్య, సుధాకర్‌గౌడ్, పట్నం కపిల్, అశోక్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి తదితరులు

కేంద్రం కార్మికులను ఇబ్బందులు పెడుతోంది

యాదగిరిగుట్ట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఐఎన్‌టీయూసీ నేషనల్ సీనియర్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం నిర్వహించిన ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మికుల హక్కులను కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, శ్రామికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ శక్తులకు మోకరిల్లుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కార్మిక చట్టాలను సాధించుకునేందుకు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. సుడుగు జీవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగన్నగౌడ్, ఉమ్మడి రాష్ట్రాల సీనియర్ కార్యదర్శి నర్సింగరావు, నేషనల్ యూత్ వింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, ఎంపీపీ చీర శ్రీశైలం, మండల అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సీస మనోహర్‌గౌడ్, మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మురళి, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు నర్సింహ, భవన కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు ఆకుల రవి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నేషనల్ సీనియర్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్